నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 21 ఆగస్టు 2024 RANGAREDDY

# ఈ రోజే తేలనున్నదా!

### పెద్దఅంబర్‌పేటలో అవిశ్వాసమా.. రాజీనామా ?

### మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసుతో రాజకీయ వేడి



కౌన్సిలర్ల సంతకాలతో కూడిన పత్రాలను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు అందిస్తున్న జయశ్రీ తదితరులు (ఫైల్)

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 20 : పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇవ్వడం పురపాలక సంఘంలో చర్చనీయాంశంగా మారింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోరుతూ 17 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన నోటీసులను అదనపు కలెక్టర్‌కు అందజేసిన విషయం తెలిసిందే. మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా.. మెజారిటీ సభ్యుల సంతకాలతో అధికారులకు అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇవ్వడంతో ఇక తొలగింపు పక్కా అని ఓ వర్గం కౌన్సిలర్లు ధీమాగా ఉన్నారు. నోటీసులు ఇచ్చినప్పటికీ అవిశ్వాసం లేకుండా స్వచ్ఛందంగా చెవుల స్వప్నతో రాజీనామా చేయించి, కొత్తగా పండుగల జయశ్రీకి చైర్‌పర్సన్ పదవి అప్పగించాలనే ప్రయత్నాలూ కొనసాగుతున్నాయి. అయితే, చైర్‌పర్సన్ స్వప్న.. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసినట్టు తెలుస్తున్నది. అవిశ్వాసానికి అవకాశం ఇవ్వొద్దని కోరినట్టు సమాచారం. ఆయన మాత్రం పార్టీ సీనియర్ నాయకులతో మాట్లాడాలని సూచించినట్టు తెలుస్తున్నది. అనంతరం కౌన్సిలర్లతోపాటు మున్సిపాలిటీకి చెందిన పార్టీ పెద్దలు పెద్దఅంబర్‌పేటలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్ల మధ్య వాడివేడిగానే చర్చలు జరిగినట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌ను ఆ పార్టీ నేతలే అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగిస్తే పార్టీ పటిష్టత దెబ్బతింటుందని సీనియర్ నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. రాజీనామా విషయంపై ఒక్కరోజులో తేల్చుకోవాలని స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది. దీనిపై బుధవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్టు సమాచారం. మున్సిపల్ కౌన్సిల్ గడువు జనవరి 25వ తేదీతో ముగియనున్నది. ఆ తర్వాత పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రాజీనామా చేసి చివరి ఐదునెలలైనా తమ వర్గానికి అవకాశం ఇవ్వాలని పలువురు కౌన్సిలర్లు గట్టిగానే కోరినట్టు సమాచారం. ఏదిఏమైనా అవిశ్వాసమా..? రాజీనామానా? అనే విషయంపై బుధవారం మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని, వస్తే ఆ ప్రక్రియను మొదలు పెడతామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

## పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 20 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్, దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు టీం మెంబర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. మంగళవారం కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌ఐలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్ టీం మెంబర్లు యాప్ ద్వారా ఏ విధంగా వెరిఫికేషన్ చేయాలనే విధానాన్ని పీపీటీ ద్వారా తెలిపామన్నారు. వెరిఫికేషన్ మెంబర్లు నేటి నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రారంభించాలని ఆదేశించారు.

దరఖాస్తులను పరిశీలించిన తర్వాత రిపోర్ట్‌ను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనుమతి లేని లే అవుట్స్‌లోని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసేందుకు మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) సుధీర్, లింగ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, విక్రం సింహారెడ్డి, బలరాం నాయక్, మాధవి, ఆర్‌ఐలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### లిస్ట్‌లో నా పేరు రాలేదు..



చేగూరు సొసైటీలో రెండేండ్ల కింద రూ.2లక్షలు లోన్ తీసుకున్నా. క్రమం తప్పకుండా మిత్తి కడుతూ వస్తున్న. వేరే చోట భూమి ఉండడంతో మరో రూ.లక్ష లోన్ తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేస్తానంటే సంతోష పడ్డా. రెండు చోట్లా మాఫీ కాలేదు. ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

– గోవిందు యాదయ్య, నర్సప్పగూడ


### మేం రైతులం కాదా ?



నాకు 3.18 ఎకరాల భూమి ఉన్నది. నందిగామ గ్రామీణ వికాస్ బ్యాంకులో గత ఏడాది లక్షన్నర లోన్ తీసుకున్న. నా కొడుకు శ్రీశైలం షాద్‌నగర్ ఎస్‌బీఐలో లక్షన్నర లోన్ తీసుకున్నడు. మాకు రేషన్ కార్డు ఒక్కటే ఉన్నది. మా ఇద్దరికీ లింకు పెట్టి ఇద్దరి లోన్ మాఫీ చేయలేదు. మేం రైతులం కాదా.. నేను రైతునే.. నా కొడుకు రైతే.. ఇప్పటికైనా రైతులందరికీ పంట రుణాలను మాఫీ చేయాలె.

– జక్కని అంజయ్య, మొత్కులగూడ

# హామీ అందరికీ.. మాఫీ కొందరికే..



### మూడు సొసైటీల పరిధిలో 278 మందికి మొండి చెయ్యి... బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరుగుతున్న రైతులు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత మండలంలో ఇదీ పరిస్థితి

## రుణమాఫీ రందిలో నందిగామ రైతులు

రంగారెడ్డి, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : 'లోన్ మాఫీ అవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నం... మాతో కలిసి బ్యాంకుల్లో లోన్ తీసుకున్నోళ్లకు మాఫీ అయింది... మాకెందుకు కాలేదు. మేమేం పాపం జేసినం..' అని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని మూడు సొసైటీల పరిధిలో పంట రుణం మాఫీ కాని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత మండలంలోని మూడు పీఏసీఎస్‌ల పరిధిలో అర్హత కలిగి ఉన్నప్పటికీ 278 మంది రైతులకు రుణవిముక్తి కలుగలేదు. ఉమ్మడి కొత్తూరు మండలం నుంచి విడిపోయి నందిగామ కొత్త మండలంగా ఏర్పాటైంది. ఈ మండలం పరిధిలో చేగూరు, నందిగామ, మేక గూడ పీఏసీఎస్‌లు ఉన్నాయి. కొత్తూరు మండలంలోని గ్రామాలు సైతం ఈ మూడు సొసైటీల పరిధిలోనే ఉన్నాయి. ఈ మూడు సొసైటీల పరిధిలోని రైతులకు రుణమాఫీ రంది పట్టుకున్నది. రూ.2లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతుల్లో చాలా మంది అర్హులు ఉన్నప్పటికీ జాబితాలో వారి పేర్లు గల్లంతు కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ ఒట్టిదేనని తేలిపోయింది. ఆయా సంఘాల పరిధిలోని లెక్కలను పరిశీలిస్తే.. నందిగామ పీఏసీఎస్‌లో 44 మంది రైతులు రుణం తీసుకోగా.. మాఫీ కోసం ప్రభుత్వానికి పంపితే కేవలం 18 మందికే రుణమాఫీ అయింది. 26 మందికి కాలేదు. మేకగూడ పీఏసీఎస్ పరిధిలో 380 మంది రైతులకు గాను 241 మందికే రుణమాఫీ అయింది. మిగిలిన 139 మంది పేర్లు జాబితాలో గల్లంతయ్యాయి. చేగూర్ పీఏసీఎస్ పరిధిలో 349 మంది రుణాలు తీసుకుంటే 236 మందికే మాఫీ అయింది. 113 మంది రుణ విముక్తికి నోచుకోలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రకరకాల నిబంధనలు పెట్టడం వల్లనే రుణమాఫీకి నోచుకోలేకపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### గొప్పలు చెప్పకోవడం మానుకోవాలి..



నందిగామ సొసైటీలో గత సంవత్సరం రూ.40వేలు క్రాప్ లోన్ తీసుకున్న. మొదటి విడతలోనే మాఫీ అవుతుందనుకున్న. కాకపోవడంతో అధికారులను అడిగితే సమస్య ఏమీ లేదన్నారు. మూడు విడతలు పూర్తయినప్పటికీ మాఫీ కాలేదు. మాఫీ కాక నాలా చాలామంది ఇబ్బంది పడుతున్నారు. అందరికీ మాఫీ చేశామని కాంగ్రెస్ గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలి.

– రాంబాబు, పీఏసీఎస్ డైరెక్టర్, నందిగామ




### కాంగ్రెస్‌వి మాయ మాటలు..



ఎన్నికలకు ముందు ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు కొర్రీలు పెడుతున్నది. నాకు కడ్తాల్ గ్రామంలో 3.02 ఎకరాల భూమి ఉన్నది. గ్రామంలోని కెనరా బ్యాంక్‌లో 2009 నుంచి పంట రుణం తీసుకుంటున్నా. ఏటా రెన్యూవల్ చేస్తున్నా. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో నా పేరు కనబడలేదు. వ్యవసాయ, బ్యాంక్ అధికారులను అడిగితే టెక్నికల్ సమస్యలు ఉన్నాయని చెబుతూ సమాధానాన్ని దాటవేస్తుండ్రు. బడా రైతులకు రుణామాఫీ అయ్యి.. నా లాంటి సన్నకారు రైతుకు కాకపోతే ఎలా? కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

– ఎల్లమోని రాజుయాదవ్, కడ్తాల్ మండలం

### ఎదురుచూపులే మిగులుతున్నయ్..



మాది ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల గ్రామం. నాకు, నా భార్యకు వేర్వేరుగా భూమి ఉన్నది. గతంలో విడివిడిగా రూ.1,14,500ల బ్యాంకు లోన్ తీసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నదని సంతోషించాం. కానీ మాకు మాత్రం మాఫీ కాలేదు. రోజూ బ్యాంకు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నం. సరైన సమాధానం చెప్పడం లేదు. ఎన్నికలకు ముందు ఒక మాట.. గద్దెనెక్కినాక ఒక మాట మాట్లాడడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదు. షరతులు పెట్టి రైతులకు ఏం న్యాయం చేస్తున్నట్టు. ఇప్పటికైనా పంట రుణం ఉన్న రైతులందరికీ మాఫీ చేయాలె.

– జవాజి రాములు, మల్లమ్మ, విఠ్యాల గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం



పొంగి పొర్లుతున్న ఫతేపూర్ మూసీ వాగు



మైలార్‌దేవరంపల్లిలో వరద నీటిలో పాడైన పత్తి పంట

# ముంచిన వాన

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు..
- నీటమునిగి పలు పంటలు ధ్వంసం.. రైతన్నలకు తీవ్ర నష్టం
- దెబ్బతిన్న రోడ్లు.. వంతెనలు
- రాకపోకలకు అంతరాయం



దోర్నాల్ -ధారూరు స్టేషన్ మధ్య ఉన్న కాగ్నా వాగు వద్ద పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

వికారాబాద్, ఆగస్టు 20 : వికారాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు వరద నీటితో ఉధృతంగా పారాయి. మండల పరిధిలోని మైలార్‌దేవరంపల్లిలోని కోళ్లోళ్ల వాగు, మద్గుల్‌చిట్టంపల్లి వాగు, రాళ్లచిట్టంపల్లి వాగు, ఆలంపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డుపై వరద నీరు ఉధృతంగా పారింది. ఆలంపల్లి రైల్వే బ్రిడ్జి నుంచి గెరిగెట్‌పల్లి వెళ్లే రోడ్డుపై నీరు ఉధృతంగా పారడంతో రాత్రి పోలీసులు బారికేడ్లు పెట్టి రాకపోకలను నిలిపివేశారు. మైలార్‌దేవరంపల్లి గ్రామంలోని కోళ్లోళ్ల వాగు వరద నీటితో ప్రవహించడంతో వాగు పక్కల ఉన్న పంట పొలాలు నీటమునిగాయి. దీంతో దాదాపు 200 ఎకరాల వరకు పత్తి, కంది, పసుపు, కూరగాయలు తదితర పంటలు ధ్వంసమయ్యాయి. పంట సాగు కోసం వేసిన డ్రిప్పులు కొట్టుకుపోయాయి. పంటలు నష్టపోయినవారందరికీ ప్రభుత్వం పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటి వరకు వ్యవసాయాధికారులు వచ్చి ధ్వంసమైన పంటలను పరిశీలించలేదని ఆయా గ్రామాల రైతులు మండిపడుతున్నారు.

### జిల్లాలో వర్షపాతం..

వికారాబాద్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకు మర్పల్లిలో 112.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మోమిన్‌పేట 133.9, నవాబుపేట 124.6, వికారాబాద్ 145.4, పూడూరు 128.5, పరిగి 135.2, కులకచర్ల 116.7, దోమ 111.9, బొంరాస్‌పేట 78.1, ధారూరు 125, కోట్‌పల్లి 119.5, బంట్వారం 123.2, పెద్దేముల్ 121.1, తాండూరు 132, బషీరాబాద్ 99.6, యాలాల 118.3, కొడంగల్ 101.1, దౌల్తాబాద్ 92.8, చౌడాపూర్ 52.9, దుద్యాల 89.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా వికారాబాద్ మండలంలో 145.4 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా చౌడాపూర్ మండలంలో 52.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

### ధారూరు మండల పరిధిలో..

ధారూరు : మండల పరిధిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దోర్నాల్–ధారూరు స్టేషన్ (కాగ్నా) వాగు పొంగిపొర్లడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన దెబ్బతిన్నది. దీంతో దోర్నాల్, అంపల్లి, గురుదోట్ల, నాగారం, కుమ్మరిపల్లి, దోర్నాల్ తండా తదితర గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కురిసిన వర్షానికి పంట పొలాలు నీట మునిగాయి.

### శంకర్‌పల్లి మండల పరిధిలో..

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి మండల పరిధిలోని టంగటూరు, ప్రొద్దుటూరు, మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా టంగటూరు, ప్రొద్దుటూరు, ఫతేపూర్ వాగులోకి వరద నీరు భారీగా చేరుతున్నది. వాగుల వద్ద ప్రమాదాలు జరుగకుండా గ్రామ పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### పంటంతా నీటిలో కొట్టుకుపోయింది..



వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాం. మాకున్న రెండెకరాల్లో పత్తి, కంది, పసుపు సాగు చేసినం. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోళ్లోళ్ల వాగు ఉధృతంగా పారింది. దీంతో వాగు పక్కనే ఉన్న మా పొలాల్లో పంటంతా కొట్టుకుపోయింది. పొలాల్లో వర్షపు నీరు నిలిచి పంటలు పాడయ్యాయి. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించాలి.

– ప్రవీణ్‌రెడ్డి, మైలార్‌దేవరంపల్లి, వికారాబాద్



పెద్దఅంబర్‌పేట : భారీ వర్షాల కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామం వద్ద మంగళ వారం వంతెనకు చేరువై ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ